చిన్న కథ

# ముడి

డా॥ కె.ఎల్.వి.ప్రసాద్

**సమయం** ఉదయం ఏడు గంటలు అయింది. అప్పటికే ఎర్రని ఎండ మొదలయింది. పైన పంకాలు తిరుగుతున్నా వళ్ళంతా చెమటతో తడిసి ముద్దయి చిటపటలాడుతోంది.

రోహిణీ కార్తె యింకా ప్రవేశించకపోయినా, రోళ్ళు బ్రద్దలయ్యేంత వేసవి వేడిమిలో ప్రజలు అతలాకుతలం అయిపోతున్నారు. అదే పనిగా నోరు తడారిపోతుండడంతో, క్షణక్షణం నోరు తడుపుకోవడానికి మంచి నీళ్ళని వెదుక్కుంటూ జనం అటు యిటు తిరుగుతున్నారు.

అప్పటికే ఆడిటోరియం, అతిథులతో, ఆ ప్రాంతపు జనంతో నిండి పోయింది. గ్రామ పంచాయితీ వాళ్ళు క్రొత్తగా, ఆ గ్రామానికి సరిపడ చిన్న ఆడిటోరియం నిర్మించి, దానికి 'ఆదర్శ ఆడిటోరియం' అని నామకరణం చేశారు.

ఆ గ్రామ ప్రజలు ఎలాంటి ఫంక్షన్ జరుపుకోవాలన్నా, నామ మాత్రపు రుసుము వసూలు చేసి, అందరికి అందుబాటులో వుండే విధంగా, చక్కని సదుపాయం కల్పించింది, గ్రామ పంచాయితీ.

ఆడిటోరియంలో ఆ రోజు ఒక పెళ్ళి జరగబోతోంది. పెళ్ళి ముహూర్తం సరిగ్గా ఉదయం 8.41 ని॥లు అని పంతులుగారు నిర్ణయించారు. అందుకే చాలమంది ముందుగానే వచ్చి తమ తమ సీట్లలో ఆశీనులయినారు.

ఆ గ్రామం ఆడిటోరియంలో పెళ్ళి జరగటం పెద్ద వింతేమీ కాదు! విశేషం అంతకంటే కాదు!! అప్పటికే ఎన్నో పెళ్ళిళ్ళు ఆ ఆడిటోరియంలో జరిగాయి. కాని, యిప్పుడు జరగబోతున్న పెళ్ళికి మాత్రం ఒక ప్రత్యేకమైన విశేషం ఉంది.


పెళ్ళి చేసుకోబోతున్న పెళ్ళికొడుకు వికలాంగుడు! పెళ్ళికొడుకు వికలాంగుడయినంత మాత్రాన ఆ పెళ్ళికి అంత విశేషం ఉండాలా? ఈ మధ్య కాలంలో అలాంటి పెళ్ళిళ్ళు ఎన్ని జరగడం లేదు! కాబట్టి కారణం అదికాదు మరి!


ఆ పెళ్ళికొడుకు పేరు నరేష్. విధివంచితుడు, పుట్టుకతోనే చేతులు లేని బోడి శరీరం కలవాడు. పుట్టి కాస్త పెరిగాక, ప్రభుత్వం నడిపే వికలాంగుల వసతి గృహంలో వదిలి, చేతులు దులుపుకున్నారు, అతని తల్లిదండ్రులు. తోచినప్పుడు చుట్టం చూపులా సరిపెట్టుకోడం తప్ప అతనితో సంబంధాలు కొనసాగించే అవకాశం వాళ్ళు తీసుకోలేదు!

నరేష్ మాత్రం తన అంగవైకల్యం గురించి అతిగా ఎప్పుడూ వ్యధ చెందలేదు. తల్లిదండ్రులు నిర్దాక్షిణ్యంగా తనను వదిలించుకున్నందుకు పెద్దగా దిగులు పడనూలేదు.

సమాజంలో యింకా తనలాంటి వాళ్ళే కాక, తనకంటే హీనస్థితిలో ఉన్నవాళ్ళు, అనేకమంది ఉన్నారన్న విషయం అతను మరచిపోలేదు. అలాంటి వారందరిలో తానూ ఒకడినని ఆత్మస్థైర్యంతో, ఆనందంగా గుడుపుతున్నవాడు.

తనకు లేని వాటిని గురించి అదే పనిగా ఆలోచించకుండా సృష్టి అందించిన, అంగాలతో తను, యితరులకు ఏ మాత్రం తీసిపోకుండా, బ్రతకడం కోసం అన్ని పనులకు యితరులను అర్థించకుండా, తనకు తానుగా చేసుకోవడం నేర్చుకున్నాడు నరేష్.





వింత ఏమిటంటే, అన్ని అవయవాలు సక్రమంగా ఉండి, ఆరోగ్యవంతులయి ఉన్నవారు కూడా చేయలేని కొన్ని పనులు నరేష్ చేయగలడు. అది అతనిలోని ప్రత్యేకత!

కాలివ్రేళ్ళతో టైప్ చేయడం, చక్కని దస్తూరితో అందంగా వ్రాయగలగడం, నోటి సహాయంతో బ్రహ్మాండమైన పెయింటింగ్‌లు వేయగలగడం, కమ్మగా, శ్రావ్యంగా పాడగలగడం, అతని ప్రతిభకు తార్కాణాలయిన అంశాలలో కొన్ని మాత్రమే!

అయినా, సమాజంలో అతనొక వికలాంగుడు. "శారీరక వికలాంగుడు".

సభ్య సమాజంలో సరిపడినంత గుర్తింపు లేనివాడు!

ఇన్ని ప్రత్యేకతలను పుణికి పుచ్చుకున్న నరేష్, నందిని దృష్టిలో పడ్డాడు. నందిని, ఆ ప్రాంతంలో పేరెన్నికగన్న ఒకానొక స్వచ్ఛంద సేవాసంస్థలో ముఖ్య సభ్యురాలు. ఎంతటి విద్యావంతురాలయినా, ప్రజాసేవకే తన పూర్తి జీవితకాలాన్ని అంకితం చేస్తున్న ఆదర్శ మహిళ!

నరేష్ శారీరక స్థితికి, అతని మనోధైర్యానికి, దృఢసంకల్పానికి చలించిపోయింది నందిని. అతనిలో ఉన్న అద్భుతమైన కళానైపుణ్యానికి అబ్బురపడింది. క్షణం ఆలస్యం చేయకుండా, అతని కోసం,

అతని భవిష్యత్ జీవితం కోసం ఏదైనా చేయాలని నిర్ణయించుకుంది.

***

నందిని చొరవతో, నరేష్ గాథ దేశమంతా క్షణాల్లో వ్యాపించి పోయింది. రకరకాల టి.వి./ రేడియో ఛానళ్ళు, వార్తాపత్రికలు అతనిని ఇంటర్వ్యూ చేసి ప్రసారం చేసాయి, ప్రచురించాయి. దాని ఫలితంగా ఎంతోమంది ఎన్నో విధాలుగా నరేష్‌ను ఆదుకోవడానికి ముందుకు వచ్చారు.

అంతేకాదు, ఒక చురుకయిన, చక్కనయిన, పేదింటి అమ్మాయి, అతనిని తన జీవిత భాగస్వామిగా చేసుకోవడానికి సంతోషంగా సిద్ధపడింది. ఆమె పేరు చందన.

తన సర్వం నరేష్ సుఖం కోసం ధారబోయడానికి సిద్ధపడిన ఒక మనసున్న మంచి అమ్మాయి!

ఇప్పుడు నరేష్-చందనను పెళ్ళి చేసుకోబోతున్నాడు. ఈ విషయంలో సర్వం తానయి అన్ని పనులు చకచక చక్కబెడుతోంది నందిని.

ముహూర్త సమయం దగ్గర పడుతోంది. ఆడిటోరియం అంతా నిండి పోయి, ఈ ఆదర్శ వివాహం వీక్షించడానికి, యింకా బయట జనం నిలబడి ఉన్నారు.

ఒక ప్రక్క పంతులుగారు, హడావిడి చేస్తూ నందిని వైపు చూస్తున్నారు. ముహూర్తం... ముహూర్తం... ముహూర్త కాలం దగ్గర పడ్తోంది.

అంతలోనే, ఒక ఆగంతకుడు పరుగు పరుగున నందినిని వెతు క్కుంటూ వచ్చాడు. నందిని చెవిలో గుసగుసలాడాడు. అంతే... ఆమె ముఖం చప్పున పాలిపోయింది. పంతులుగారు మంత్రాలు చదువుతున్నాడు. ముహూర్తకాలం మరింత దగ్గరపడింది. పంతులు గారి వైపు దృష్టి మరల్చి, ప్రస్తుతానికి మంత్రాలు ఆపమన్నట్టుగా సైగ చేసింది నందిని. అంతే.. మంత్రాలు ఆగిపోయాయి! అక్కడ నిశ్శబ్ద వాతావరణం నెలకొని వుంది. జనంలో గుసగుసలు బయలుదేరాయి. విషయం ఏమిటో వధూవరులను కూడ తెలియడం లేదు. అకస్మాత్తుగా మంత్రాలు ఎందుకు ఆగిపోయాయి. అర్థం చేసుకునే పరిస్థితిలో వాళ్ళు లేరు.

***

అదే గ్రామం గుండా హైద్రాబాద్‌కు వెళ్తున్న మంత్రిగారికి, ఆ ఆదర్శ వివాహం గురించిన సమాచారం అందింది. మరి, మంత్రి గారికి తెలిసిన తర్వాత యింత మంచి కార్యక్రమం వదులుకుంటే ఎలా? క్షణాల మీద బుర్రలో తళుక్కున మెరిసింది ఐడియా మంత్రిగారికి, అంతే... తను వచ్చేవరకు పెళ్ళి ఆపమని చిన్న హుకుం జారీ చేశారు మంత్రివర్యులు!

ముహూర్తం దాటిపోయి చాలా సేపమయింది.

అందరూ చికాగ్గా తమ తమ కుర్చీలకు అతుక్కుపోయి, అసహనంగా కూర్చున్నారు. అసలు సంగతి ఆ నోటా, యీ నోటా అందరికి తెలిసిపోయింది.

ముహూర్తానికి మూడు గంటలు ఆలస్యంగా ఆడిటోరియంకి వచ్చారు మంత్రిగారు. ఆయన మంది, మార్బలం ముందు, పంతులుగారి ముహూర్తబలం వీగిపోయింది. దగ్గరుండి పెళ్ళి జరిపించారు మంత్రిగారు. అసలివాళ్ళ జాడ అక్కడ అసలు కన్పించలేదు.

సెక్యూరిటీ పేరు మీద అందరూ చెల్లాచెదురయిపోయారు.

మర్నాడు వార్తాపత్రికల్లో మంత్రిగారి ఫోటో బ్రహ్మాండంగా వచ్చింది. వధూవరుల చుట్టు అంతా ఆయన పరివారమే కన్పించింది. పేపర్లలో ఎక్కడా, నందిని ఫోటోగాని, పేరుగాని కన్పించలేదు.

